RNI : APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక



కొద్ది నెలలు నేనే సారథిగా ఉంటా.. : రోహిత్!

5లో..

ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్ | సోమవారం 13 జనవరి 2025 | సంపుటి : 12 | సంచిక : 345 | పేజీలు : 8 | వెల : 4/-

## నీది ఏ పార్టీ?.. నీకేం సంబంధం?..

- ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌ల మాటల యుద్ధం
- కరీంనగర్ కలెక్టరేట్ సమావేశంలో రసాభాస
- మంత్రుల సమక్షంలో వాగ్వాదాలు

03





# నాకెలాంటి భేషజాలు లేవు.. అందరి సహకారం తీసుకుంటా




అందరూ సహకరించండి.. ప్రపంచంతో పోటీ పడదాం

- కేంద్ర మంత్రులు, భాజపా నేతలు తోడ్పడాలి
- యూనివర్సిటీలకు పూర్వవైభవం
- 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణకు పతకమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీహెచ్ విద్యాసాగర్‌రావు రచించిన 'ఉనిక' పుస్తకావిష్కరణ

**హైదరాబాద్:** రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి భేషజాలు లేకుండా అందరి సహకారం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు అందరూ సహకరించాలన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటికోసం రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, భాజపా రాష్ట్ర కీలక నేతలు ప్రధాని నరేంద్రమోదీతో చర్చించాలని కోరారు. మహారాష్ట్ర, తమిళనాడు మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు రచించిన 'ఉనికి' పుస్తకాన్ని ఆదివారం

మిగతా 2 లో



## స్వేచ్ఛా సౌభాగ్యాలతో సంక్రాంతి జరుపుకోవాలి

శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, కేంద్ర మంత్రి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



## 'పోడు' పట్టాదారులకూ రైతుభరోసా

- మార్గదర్శకాలు విడుదల
- 26 నుంచి పథకం అమలు

**హైదరాబాద్:** అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద పట్టాలు పొందిన పోడు భూములకూ రైతుభరోసా పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రైతుభరోసా విధివిధానాలపై ఆదివారం వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు మార్గదర్శకాలను విడుదల చేశారు. "తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి కట్టుబడి ఉంది. రాష్ట్ర రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించడం ద్వారా.. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు సాగులో ఆధునిక పద్ధతులు పాటించడానికి, అవసరమైన వనరులను సేకరించడానికి వీలు కల్పించవచ్చు.

మిగతా 2 లో

మాజీ ఎంపీ మందా జగన్నాథం

## కన్నుమూత



02



## మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

కాన్వాయ్‌లో ప్రయాణిస్తుండగా పేలిన కారు టైర్లు

హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి

## సోమవారం సెలవు

కమిషనర్ రంగనాథ్



02

## శ్రీరామావతారంలో యాదగిరీశుడు

**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చేపట్టిన అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామిని శ్రీరామచంద్రుడి అవతారంలో, సాయంత్రం శ్రీవేంకటేశ్వరస్వామి అవతారంలో అలంకరిం చారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగించారు. మహా విష్ణువును స్తుతించే దివ్య ప్రబంధ పారాయణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.



## మార్చి నాటికి 314 ఈ-బస్సులు!

తెలంగాణ ఆర్టీసీలో విద్యుత్ బస్సులు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నాటికి దశలవారీగా మరో 314 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించాలని సంస్థ భావిస్తోంది. ఇవన్నీ హైదరాబాద్‌తోపాటు కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు అందుబాటులోకి రానున్నాయి.

03





## భువనగిరిలో ఉద్రిక్తత

- ఆందోళనలను అడ్డుకునేందుకు పోలీసుల యత్నం
- వ్యూహాత్మకంగా భారాస శ్రేణుల ధర్నాలు
- పైళ్ల శేఖర్‌రెడ్డి సహా పలువురు నేతల అరెస్టు

భారాస జిల్లా కార్యాలయంపై దాడి నేపథ్యంలో ఆ పార్టీ ఇచ్చిన ధర్నా పిలుపుతో భువనగిరిలో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. భారాస శ్రేణుల రాస్తారోకోలు.. అరెస్టులతో ఉద్రిక్తత ఏర్పడింది. ధర్నా పిలుపు నేపథ్యంలో భువనగిరి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన భారాస నాయకులు, కార్యకర్తలు ముందే పట్టణానికి చేరుకుని బస్టాండు, హొటళ్లు, దుకాణాల్లో ఉన్నారు. ఆందోళనలను అడ్డుకునేందుకు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**భువనగిరి :** స్వామి వివేకానంద జ యంతి సందర్భంగా భువనగిరిలోని బస్టాండు ఎదుట ఉన్న ఆయన విగ్ర హానికి నివాళి అర్పించేందుకు కాం గ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఆదివారం ఉ దయం 11.40 గంటలకు చేరుకున్నారు. అదే సమ యంలో భారాసకు చెందిన

మిగతా 2 లో

## భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయం

03





03

## కాంగ్రెస్ ఎన్ని దాడులు చేసినా ప్రశ్నిస్తూనే ఉంటాం

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



## కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో విధ్వంసం

- సీఎం రేవంత్ పై 420, 406 కేసులు నమోదు చేయాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**పెద్దపల్లి :** ఏడాది కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురయ్యిందని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పెద్దపల్లిలో ఆదివారం జరిగిన ఆత్మీయ మేధోమదన సదస్సులో వ్యాపార నిపుణులతో కలిసి ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరూ ఇన్సూరెన్స్ చెల్లించి భరోసా కల్పించుకోవాలని అన్నారు. యూ రూల్ వంటి కంపెనీలు స్థాపించి ప్రపంచ పటంలో నిలవాలని ఆయన తెలిపారు.

మిగతా 3 లో



02

## ఆంధ్రా అల్లుడికి.. 130 రకాల తెలంగాణ వంటకాలు



02

## నటుడు వెంకటేశ్‌పై కేసు

- దగ్గుబాటి సురేశ్, రానా, అభిరామ్‌లపైనా కూడా..



# 'పోడు' పట్టాదారులకూ రైతుభరోసా

(మొదటిపేజీ తరువాయి)

ఇది రాష్ట్రంలో గ్రామీణ అభివృద్ధికి, ఆహార భద్రతకు తోడ్పడుతుంది. 'రైతు భరోసా' పథకం జనవరి 26 నుంచి అమల్లోకి వస్తుంది" అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యాంశా లను వివరించారు. భూభారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు సాయం అందించాలి. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైత-ుభరోసా నుంచి తొలగించాలి. ఆర్‌బీఐ నిర్వహించే ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో సాయం రైతుల ఖాతాలో జమ. వ్యవసాయ సంచాలకుల ఆధ్వర్యంలో పథకం అమలు. దీనికి ఎన్‌ఐసీ హైదరాబాద్ ఐటీ భాగస్వామి. కలెక్టర్లు తమ జిల్లాలకు సంబంధించి పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారానికి బాధ్యులుగా ఉంటారు.

# మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

## కాన్వాయ్‌లో ప్రయాణిస్తుండగా పేలిన కారు టైర్లు

**తిరుమలాయపాలెం :** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు ఒక్కసారిగా పేలగా.. ఆయనకు పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం వరంగల్‌లో తన పర్యటన ముగించుకుని, తిరుగు ప్రయాణంలో ఖమ్మం వస్తున్నారు. ఈ క్రమంలో తిరుమలాయపాలెం మండలం శివారు చింతపల్లి వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు ఎడమ వైపు ముందు, వెనక టైర్లు పేలిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని అదుపులోకి తేవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కారులో పొంగులేటి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్లు రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య ఉన్నారు. అనంతరం వారందరూ ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మం వెళ్లిపోయారు.

# మాజీ ఎంపీ మందా జగన్నాథం కన్నుమూత



**హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం(73) ఆదివారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం డిసెంబరు 22న నిమ్స్‌లో చేరారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో గుండెపోటు రాగా.. 7:40 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో 1951 మే 22న జగన్నాథం జన్మించారు. రాజకీయాల్లో ప్రవేశించి.. అంచెలంచెలుగా ఎదిగారు. నాగర్‌కర్నూల్(ఎస్సీ రిజర్వుడ్) లోక్‌సభ స్థానం నుంచి నాలుగుసార్లు విజయం సాధించారు. 1996, 1999, 2004లలో తెదేపా తరపున వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచారు. 1998లో ఎంపీగా పోటీచేసి ఓటమి చవిచూశారు. 2009లో కాంగ్రెస్ తరపున బరిలో నిలిచి మరోసారి ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్‌ను వీడి భారాస(అప్పటి తెరాస)లో చేరారు. 2014లో భారాస అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీలో చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జగన్నాథం మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు సంతాపం ప్రకటించారు.

# ఆంధ్రా అల్లుడికి.. 130 రకాల తెలంగాణ వంటకాలు



**హైదరాబాద్:** సంక్రాంతి పండగకు హైదరాబాద్ వచ్చిన ఓ ఆంధ్రా అల్లుడికి అత్తింటివారి మర్యాదలు అబ్బురపరిచాయి. పెళ్లయినతర్వాత తొలిసారి వచ్చిన అల్లుడికి అత్తమామలు 130 రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన తమ అల్లుడికి తెలంగాణ వంటకాలు రుచి చూపించి ఆనందపరిచారు. సరూర్‌నగర్ సమీపంలోని శారదానగర్‌లో నివాసముంటున్న కాంత్రి-కల్పన దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. పెద్ద కుమార్తెను కాకినాడకు చెందిన మల్లిఖార్జున్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిపించారు. సంక్రాంతికి తొలిసారి అల్లుడు రావడంతో ఆయనకు తెలియకుండా సర్‌ప్రైజ్ చేసేందుకు పిండివంటలతో పాటు మాంసాహారం, శాఖాహారం లాంటి 130 రకాల వంటలు వడ్డించారు.

# నాకెలాంటి భేషజాలు లేవు.. అందరి సహకారం తీసుకుంటా

(మొదటిపేజీ తరువాయి)





హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్‌రావుతోపాటు హరియాణా, ఒడిశా గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రు లు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర మాజీమంత్రి టి.సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి, ఎమెస్కో అధి నేత విజయ్‌కుమార్, ప్రతిమ సంస్థల అధినేత బి.శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మెట్రోరైల్ విస్తరణకు అనుమతి వచ్చేలా బండి సంజయ్ ప్రయత్నించాలని కోరారు. "అమరావతితో పోటీలేదు.. ప్రపంచంతో, న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతోనే పోటీపడదాం. తెలంగాణలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోంది. విశ్వనగరంగా మారాలంటే రీజనల్ రింగ్‌రోడ్డుతో పాటు రీజనల్ రింగ్‌రైల్ అవసరం. ఇవి కావాలని ఇటీవల ప్రధానిని కోరాం. తమిళనాడు, కర్ణాటకల్లో అధికారంలో ఉన్నవి భాజపా ప్రభుత్వాలు కాకున్నా కేంద్రం మెట్రో విస్తరణకు తోడ్పాటు అందిస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా తమిళనాడు నేతల తరహాలో సమష్టిగా కృషిచేద్దాం. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు ఉనికిని కోల్పోయేలా ఉన్నాయి. అందుకే ముఖ్యమంత్రి కాగానే వాటికి పూ-ర్వవైభవం తీసుకువచ్చేందుకు నిర్ణయాలు తీసుకున్నాం. యూనివర్సిటీల విద్యార్థులు రాజకీయాల్లో ఉండాలి. ఉస్మానియా యూనివర్సిటీ రాజకీయాల్లో జార్జిరెడ్డి, విద్యాసాగర్‌రావులు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారు. రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం లేకపోవడం వల్లే మనం చూస్తున్న పార్టీ ఫిరాయింపులు. పదవుల కోసం పార్టీలు మారుతూనే ఉంటారు. సిద్ధాంతపరమైన విద్యార్థి రాజకీయాలను పునరుద్ధరించా ల్సిన అవసరం ఉంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనం జూన్ 2లోపు పూర్తవుతుంది. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణకు పతకం రావాలన్న లక్ష్యంతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. విద్యాసాగర్‌రావును అభిమానించేవారంతా సాగర్‌జీ అని పిలుస్తారు. మహారాష్ట్ర, తమిళనాడుల్లో ఆయన గవర్నర్ విధులను సమ-ర్థవంతంగా నిర్వహించి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టారు. 5 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన ఏ ఒక్క ఆరోపణ ఎదుర్కోకపోవడం అభినందనీయం. తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ కోసం మహారాష్ట్ర నుంచి భూసేకరణకు ఆయన సహకారం తీసుకుంటాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో జాతీయ, సాంస్కృతిక వాదం బలంగా ఉందని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సీహెచ్.విద్యాసాగర్‌రావు అన్నారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్న 'స్కిల్ డెవలప్‌మెంట్' ఎంతో అవసరం. మూసీ పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రభాగాన నిలబెట్టాలనుకోవడం మంచి అంశం" అని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. బండారు దత్తాత్రేయ, కంభంపాటి హరిబాబు, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు మాట్లాడారు.

### ఆడ్వాణీకి రోజంతా చాయ్ అందించా - బండి సంజయ్

భాజపాలో తెలంగాణవాదం, నినాదాన్ని మొదట ఎత్తుకున్న వ్యక్తి విద్యాసాగర్‌రావు అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనను సంజయ్ గుర్తుచేసుకున్నారు. "ఆడ్వాణీ పర్యటన రోజు ఉదయం విద్యాసాగర్‌రావు నాకు ఒక ఫ్లాస్క్, టీ కప్పు బ్యాగ్ చేతికి ఇచ్చి 'ఈ రోజంతా ఆడ్వాణీ వెంట నువ్వే ఉండాలి.. ఆయనకు చాయ్ అంటే చాలా ఇష్టం.. గంటగంటకు ఇవ్వాల్సిన బాధ్యత నీదే' అని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా చాలా చాయ్‌లు ఇచ్చా.. చివర్లో ఆడ్వాణీ వెళుతూ.. చాయ్ బాగా నచ్చిందని అన్నారట" అని చెప్పారు.

# స్వేచ్ఛా సౌభాగ్యాలతో సంక్రాంతి జరుపుకోవాలి

- శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, కేంద్ర మంత్రి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్:** తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను తెలుగు ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. "రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండగ కొత్త వెలుగులు తెస్తుంది. రైతుభరోసాను రూ.12 వేలకు పెంచటంతోపాటు.. వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండగ నాంది పలుకుతోంది. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది మా సంకల్పం. వ్యవసాయంతోపాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా రాష్ట్రం తిరుగులేని పురోగతి సాధిస్తుంది.

స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండగ సంబురాలు జరుపుకోవాలి. పతంగులు ఎగురవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భోగి, సంక్రాంతి పండగలతో ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు.

# నటుడు వెంకటేశ్‌పై కేసు

## దగ్గుబాటి సురేశ్, రానా, అభిరామ్‌లపైనా..



**హైదరాబాద్:** కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హోటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో సినీనటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్‌తోపాటు నిర్మాత దగ్గుబాటి సురేశ్‌పై కేసు నమోదైంది. నాంపల్లి కోర్టు ఆదేశాలతో ఫిల్మ్‌నగర్ పోలీసులు శనివారం వారిపై పలు సెక్షన్ల కింద కేసులు పెట్టారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్ రోడ్డు నంబర్ 1లో వెంకటేశ్‌కు చెందిన 1000 గజాల స్థలాన్ని 2014లో నందుకుమార్ అనే వ్యక్తి లీజుకు తీసుకున్నారు. అక్కడ దక్కన్ కిచెన్ పేరుతో ఆయన ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. లీజు ఒప్పందం విషయంలో విభేదాలు రావడంతో ఇద్దరూ పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తుది తీర్పు వచ్చే వరకు అక్కడ ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించింది. మరోవైపు దక్కన్ కిచెన్‌కు పక్కనే ఉన్న తన స్థలానికి లీజు ముగిసినా నందుకుమార్ నిర్మాణాలు చేపట్టారని రానా జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసి 2022లో దక్కన్ కిచెన్ నిర్మాణాలు పాక్షికంగా కూల్చివేశారు. దీంతో నందుకుమార్ హైకోర్టును ఆశ్రయించగా యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. తన సిబ్బందిపై దాడి చేయడంతోపాటు కోర్టు ఆదేశాలున్నా ధిక్కరించి దక్కన్ కిచెన్‌ను పూర్తిగా కూల్చివేశారని, దీంతో రూ.20 కోట్ల నష్టం వాటిల్లిందని నందుకుమార్ ఇటీవల నాంపల్లి క్రిమినల్ కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం సూచనల మేరకు దగ్గుబాటి కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు దగ్గుబాటి కుటుంబానికి చెందిన స్థలాన్ని తనదిగా చెబుతూ మరో ఇద్దరికి లీజు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో నందుకుమార్‌పైనా గతంలో రెండు కేసులు నమోదయ్యాయి.

# హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం సెలవు

## కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్:** హైడ్రా ప్రజావాణి కార్యక్రమం సోమవారం ఉండదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. సంక్రాంతి పండుగ సెలవుల కారణంగా ప్రజావాణిని నిర్వహించలేకపోతున్నామని రంగనాథ్ ప్రకటించారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో హైడ్రా ప్రజావాణి ఉండదని ఇది వరకే ప్రకటించిన రంగనాథ్.. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో మాదిరి.. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రాణిగంజ్‌లోని బుద్ధ భవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఫిర్యాదులకు 040-29565758, 29560596 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు, పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను హైడ్రా అధికారులు స్వీకరిస్తున్నారు.

# భువనగిరిలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డిలు అక్కడికి చేరుకుని.. రోడ్డుపై బైఠాయించారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వారిని అనుసరించి అక్కడికి చేరుకుని.. రాస్తారోకోలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేస్తుండగా.. ఇరు పార్టీల శ్రేణులు పోటీపోటీగా నినాదాలు చేశాయి. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడ నుంచి ఎమ్మెల్యే వెళ్లిపోయాక.. శేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌కు.. కర్నె ప్రభాకర్, రామకృష్ణారెడ్డిలను బీబీనగర్ స్టేషన్‌కు తరలించారు. భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో కొందరు భారాస నాయకులు అరగంటకుపైగా రాస్తారోకో చేశారు. వారిని పోలీసులు అదుపులో తీసుకుని వాహనాల్లో ఠాణాలకు తరలించారు.

### పలువురు నేతల గృహనిర్బంధాలు..

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి భువనగిరికి వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం ఘట్‌కేసర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను రామన్నపేటలో, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌ను నల్గొండలో, బూడిద భిక్షమయ్యగౌడ్‌ను ఉప్పల్‌లో, డీసీసీబీ మాజీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని యాదగిరిగుట్టలో గృహ నిర్బంధం చేశారు. జడ్పీ మాజీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి హైదరాబాద్‌లో గృహ నిర్బంధంలో ఉంచగా.. ఆయన అక్కడి నుంచి తప్పించుకుని, భారాస సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి భువనగిరికి చేరుకోగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని బీబీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు ప్రిన్స్ చౌరస్తాకు చేరుకోగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని బీబీనగర్ రూరల్ స్టేషన్‌కు తరలించారు.

# నీది ఏ పార్టీ? నీకేం సంబంధం?

- ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, డా.సంజయ్‌ల మాటల యుద్ధం
- కరీంనగర్ కలెక్టరేట్ సమావేశంలో రసాభాస
- మంత్రుల సమక్షంలో వాగ్వాదాలు



**కరీంనగర్:** కరీంనగర్ కలెక్టరేట్‌లో అభివృద్ధి కార్యక్రమాల సన్నద్ధతపై ఆదివారం నిర్వహించిన సమావేశం రసాభా సగా మారింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను ఉ ద్దేశించి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నీటిపారు దల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఈ ఘటన జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. వారి వెంటే కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ రమణ వెళ్లిపోయారు. అధికారిక కార్యక్రమంలో జరిగిన ఈ ఘటనను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఏడు సార్లు గెలిచిన తాను రాజకీయంగా ఇలాంటి ప్రవర్తనను ఎన్నడూ చూడలేదంటూ తోటి శాసనసభ్యుడితో కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భారాస అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పార్టీలకు కనీసం మాట్లాడే అవకాశాన్ని ఇవ్వలేదని, పత్రికల్లో హైలెట్ అయ్యేందుకే కౌశిక్‌రెడ్డి ఇలా వ్యవహరించారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పార్టీలు మారిన కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో భారాస నిర్మించుకున్న పార్టీ కార్యాలయం కూడా కబ్జాలో ఉందన్నారు.
దీన్ని ఆ పార్టీ వాళ్లు కూల్చేస్తారా? లేదా ప్రభుత్వం కూల్చేసే పరిస్థితి తెచ్చుకుంటారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎన్ని దాడులు చేసినా
# ప్రశ్నిస్తూనే ఉంటాం
## భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**హైదరాబాద్:** ఎన్ని దాడులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భారాస పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే కాంగ్రెస్ శ్రేణులు దాడులకు తెగబడుతున్నాయని ఆరో పించారు. "రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలపై మా పార్టీ జిల్లా నేతలు సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకనే కాంగ్రెస్ కార్యకర్తలు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారు. మీ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ప్రధాన ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా? చేతిలో రాజ్యాంగం పట్టుకుని ప్రచారం చేసుకునే రాహుల్‌గాంధీకి.. రేవంత్ పాలనలో సాగుతున్న అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా? రాహుల్‌గాంధీ ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలి. మా పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటన వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలి" అని డిమాండ్ చేశారు.

# మార్చి నాటికి 314 ఈ-బస్సులు!




**హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీలో విద్యుత్ బస్సులు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నాటికి దశలవారీగా మరో 314 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించాలని సంస్థ భావిస్తోంది. ఇవన్నీ హైదరాబాద్‌తోపాటు కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు అందుబాటులోకి రానున్నాయి. డీజిల్‌తో నడిచే బస్సులతో వాయు కాలుష్యం ప్రధాన సమస్యగా మారింది. విద్యుత్ బస్సులతో కాలుష్యం సున్నా. ఇవి హైదరాబాద్‌లో చాలా రోజుల క్రితం నుంచే నడుస్తున్నాయి. జిల్లాల్లోనూ క్రమంగా అందుబాటులోకి వస్తున్నాయి. గతంలోనే కరీంనగర్, నిజామాబాద్ డిపోల్లో ఉండగా.. కొద్దిరోజుల క్రితం వరంగల్‌కు 50 ఈ-బస్సులు కేటాయించారు. త్వరలో కరీంనగర్-2 డిపోనకు మరో 33, నిజామాబాద్-2కు 54, వరంగల్‌కు 36, సూర్యాపేటకు 52, నల్గొండకు 65, హైదరాబాద్‌కు 74 రానున్నట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లోని 25 బస్ డిపోల పరిధిలో 2,870 సిటీ బస్సులున్నాయి. ఇవి నిత్యం 7.84 లక్షలు కి.మీ. తిరుగుతున్నాయి. సగటున రోజుకు ప్రయాణికుల సంఖ్య 24.12 లక్షలు. డీజిల్‌తో నడిచే వీటి కారణంగా రోజూ 409 టన్నుల కాలుష్య ఉద్గారాలు వెలువడుతున్నట్లు అంచనా. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో డీజిల్ బస్సులన్నింటినీ దశలవారీగా తొలగించి మొత్తం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ-బస్సులు పర్యావరణంతోపాటు ప్రయాణికులకూ అనుకూలమే. ఇవి లోఫ్లోర్ బస్సులు. అంటే ఒక్క అడుగుతో ఎక్కవచ్చు, దిగవచ్చు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యంగా ఉంటాయి. ఈ-బస్సుల్లో సీసీ టీవీ నిఘా కూడా ఉంటుంది. కరీంనగర్-2 డిపోలో ఇప్పటికే 41 ఈ-బస్సులు ఉండగా.. ఇందులో 35 సూపర్‌లగ్జరీ, 6 డీలక్స్ ఉన్నాయి. కరీంనగర్-జేబీఎస్, కరీంనగర్-సిరిసిల్ల, కరీంనగర్-వరంగల్ రూట్లలో వీటిని నడిపిస్తున్నారు. నిజామాబాద్-2 డిపోలో 13 ఉండగా.. అన్నీ సూపర్‌లగ్జరీలే. నిజామాబాద్-జేబీఎస్ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో
# తెలంగాణలో విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)
ప్రస్తుతం దేశంలో వందకు కేవలం 14 మందికే ఇన్సూరెన్స్ ఉందని గుర్తుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన బదులు ప్రతీకార, అక్రమ కేసుల పాలన కొనసాగుతోందని విరుచుకు పడ్డారు. తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడినందుకు సీఎం రేవంత్ రెడ్డిపై 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఎ1 నిందితునిగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ రేసు వల్ల రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చేవన్నారు. ఫార్మలా ఈ రేసు, మొబిలిటీ వ్యాలీ రద్దు చేయకుంటే తెలంగాణ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ కు కేంద్రంగా మారేదన్నారు. చేయని తప్పుకు కెటిఆర్ ను అరెస్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేశారన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సరిగా లేదని చెబుతూ భువనగిరిలో బిఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై దాడి జరిగితే పోలీసులు పట్టించుకోకుండా నిందితుడిని సిఐ కుర్చీలో కూర్చోబెట్టి రాచ మర్యాదలు చేశారన్నారు. ఓటుకు నోటు కేసులో జైలు శిక్ష అనుభవించి, 75 కేసులు ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే, పరిస్థితి ఇలాగే ఉ ంటుందన్నారు. పోలీసుల బదులు రాక్షస గూండాలే చట్టాన్ని చేతిలోకి తీసుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రాజ్ భవన్ ముందు ధర్నా చేస్తే తప్పు లేదు కానీ, ఎసిబి విచారణ అనంతరం నడిచి వెళ్తే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. బిజెపి, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి కోసం బండి సంజయ్ రేవంత్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్.పి.ఎఫ్) ఏర్పాటు చేస్తే, రేవంత్ రెడ్డి బండి సంజయ్ కోసం బి.ఎస్.ఎఫ్ (బండి సంజయ్ సెక్యూరిటీ ఫోర్స్) ఏర్పాటుచేశారని చురకలంటించారు. తాను కూడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తనని మనమంతా ఒక్కటే అనే భావనలో రేవంత్ ఉన్నారన్నారు. అందుకే బిఆర్ఎస్ బిజెపి కాదు, బిజెపి, కాంగ్రెస్ పార్టీలే ఒక్కటని వివరించారు.

# భారాస పదేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదు

- ఐదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**మహబూబ్‌నగర్ :** నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పాలించమని చేతిలో పెడితే భారాస పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని, ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట, బిజినేపల్లి, తాడూరు, నాగర్‌కర్నూల్ మండలాల్లో ఐదు 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలకు ఆయన శంకుస్థాపన చేశారు. బిజినేపల్లి మండలం శాయినిపల్లిలో రూ.76.95 కోట్లతో నిర్మించిన మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆయా సమావేశాల్లో భట్టి మాట్లాడారు. "వచ్చే ఐదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం. ఈ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. వారి సమస్యలన్నీ మేం పరిష్కరిస్తాం. దుష్ప్రచారం చేసిన వారి చెంప ఛెళ్లుమనేలా రైతుభరోసా కింద ఇచ్చే మొత్తాన్ని రూ.12 వేలకు పెంచాం. భూమి లేని నిరుపేదలకు జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు పంపిణీ చేస్తాం. 108 తరహాలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి 1912 నంబరును అందుబాటులోకి తీసుకొచ్చాం" అని భట్టి పేర్కొన్నారు. ఆబ్కారీ, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. రైతాంగానికి ఉచిత విద్యుత్తుతోపాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు ఇస్తామని చెప్పారు. పాలమూరు అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం భట్టిని కోరారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కల్వకుర్తి, అచ్చంపేట, వనపర్తి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డా.వంశీకృష్ణ, మేఘారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ పాల్గొన్నారు.



# భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయం

**వేములవాడ :** దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం భక్తజన సంద్రమైంది. సెలవు దినం కావడంతో ఆదివారం స్వామివారిని దాదాపు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పక్క రాష్ట్రాల తో పాటు తెలంగాణ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సుమారు 40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. సోమవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఇన్చార్జి ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.




## స్వామి వివేకానందునికి ఘన నివాళి

**నాగారం, జనవరి 12 (నేటి ప్రస్థానం) : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా మల్కాజ్ గిరి ఐ.టి సెల్ ఇంచార్జ్ దూసరి శ్రీకాంత్ గౌడ్ ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.**

# జర్నలిస్టుల ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

## ధన్యవాదాలు తెలియజేసిన టియుడబ్ల్యూజే నేతలు



**కూకట్‌పల్లి, జనవరి 12 (నేటిప్రస్థానం) :** సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వివేకానందనగర్ కాలనీలోని బండారు ఆసుపత్రి యాజమాన్యం జర్నలిస్టుల కోసం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్,మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ నిత్యం ఎంతో మానసిక ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల సద్ద వహించాలని సూచించారు.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పాత్ర సమాజానికి అత్యంత అవసరం అన్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వాహకులు,డాక్టర్ సుశృత్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరితపించే జర్నలిస్టుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో ఈకో, టుడిఇకో,ఈసీజీ,బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గుండె సంబంధిత అన్ని పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ గుండె వైద్య శిబిరంలో 60 మంది జర్నలిస్టులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. నిత్యం మానసిక ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు ఎక్కువ శాతం బిపి, షుగర్ తో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. తప్పనిసరిగా సంవత్సరానికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. జర్నలిస్టులకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వైద్య సహాయం చేయడానికి తమ సిద్దంగా ఉన్నామని తెలిపారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ నేటి యాంత్రిక యుగంలో జర్నలిస్టులు తప్పని సరిగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.ఆసుపత్రి నిర్వాహకులకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ తరపున,కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జర్నలిస్టు నాయకులు మామిడాల రవీందర్ రెడ్డి,పరమేష్, దయాసాగర్,నిమ్మల శ్రీనివాస్, రాహుల్, నాగరాజు యాదవ్, మాణిక్యరెడ్డి, శేషారెడ్డి, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కరీం,లక్ష్మణ్, హరి, భాస్కర్, చంద్ర, బంటు ప్రవీణ్, అంజిబాబు,నగేష్, కిషోర్, నరసింహ,స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.







## కాంగ్రెస్ నుండి బీజేపీలోకి చేరికలు

### ఈటెల సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ నాయకులు



**జవహర్ నగర్, జనవరి 12 (నేటి ప్రస్థానం) :** దేశ అభివృద్ధి మోడీతోనే సాధ్యమవుతుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ డివిజన్ 26 కార్పొరేటర్ పణాగంటి బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 120 మంది ఈటెల రాజేందర్ సమక్షంలో బిజెపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ బిజెపి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి,మేడ్చల్ బిజెపి కాంటెస్ట్ ఏనుగు సుదర్శన్ రెడ్డి,జోహార్ నగర్ ఈస్ట్ అధ్యక్షులు కమల్,కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్,రవీందర్ రెడ్డి,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 2025లో రూ.3 లక్షల కోట్ల ఐపీఓలు!

ముంబయి: ఈ ఏడాది ఐపీఓల ద్వారా కంపెనీలు 35 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్ల) మేర సమీకరించే అవకాశం ఉందని కోటక్ క్యాపిటల్ అంచనా వేసింది. 2024లో కంపెనీలు సమీకరించిన 22 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.8 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది గణనీయ వృద్ధి అని తెలిపింది. 2025లో ఆర్థిక సేవల రంగం నుంచి అత్యధికంగా 9 బిలియన్ డాలర్ల (రూ.76,500 కోట్ల) విలువైన ఐపీఓలు రానున్నాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్, టాటా క్యాపిటల్ వంటి కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఈకామ్ ఎక్స్‌ప్రెస్, జెప్టో, పెప్పర్‌ఫ్రై వంటివి 5 బిలియన్ డాలర్ల (రూ.42,500 కోట్ల)ను సమీకరించనున్నాయి. కంపెనీల ఐపీఓ పరిమాణాలు స్థిరంగా పెరుగుతున్నాయని, భవిష్యత్తు పెట్టుబడుల కోసం పబ్లిక్ ఇష్యూకు వెళ్లాలని చూసే కంపెనీల సంఖ్య పెరుగుతోందని కోటక్ క్యాపిటల్ తెలిపింది. 2024లో వచ్చిన 91 ఐపీఓల సగటు లిస్టింగ్ లాభాలు 32.8 శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు కూడా తమ పెట్టుబడుల కోసం ఐపీఓలపై ఆధారపడుతున్నారని, సెకండరీ మార్కెట్ కంటే దీనివైపే చూస్తున్నారని తెలిపింది. ఐపీఓకు ముందు లక్ష్మీ డెంటల్ యాంకర్ మదుపర్ల నుంచి రూ.314 కోట్ల నిధుల్ని సమీకరించింది. 31 సంస్థలకు ఒక్కో షేరు రూ.428 చొప్పున మొత్తం 73.39 లక్షల షేర్లను కేటాయించడం ద్వారా రూ.314.12 కోట్లను సమీకరించింది. ఐపీఓ 13-15 తేదీల్లో ఉండనుంది. ధరల శ్రేణి రూ.407-428. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.138 కోట్లు సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్లకు చెందిన 1.31 కోట్ల వరకు షేర్లు విక్రయించడం ద్వారా రూ.560 కోట్లు సేకరించనుంది.




## అల్పాదాయ వర్గాలకు ఆదాయపు పన్ను తగ్గించాలి

- **ఈవై ఇండియా సూచన**
- **'బడ్జెట్ 2025-26 విన్నపాలు'**

ప్రైవేటు మూలధన వ్యయాలను ప్రోత్సహించడం, పన్నుల సరళీకరణ, తక్కువ ఆదాయ వర్గాలకు వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గింపు వంటి వాటిపై కొత్త బడ్జెట్‌లో దృష్టి సారించాలని ఈవై ఇండియా సూచించింది. దేశీయంగా గిరాకీని ఉత్తేజపర్చడానికి ఈ చర్యలు దోహదం చేస్తాయని పేర్కొంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను వచ్చే నెల 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈవై ఇండియా తన అభిప్రాయాన్ని తెలిపింది. 2023-24లో రూ.31 లక్షల కోట్ల మేర ఆదాయపు పన్ను వివాదాలు ఏర్పడ్డాయి. వీటిని కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ (అప్పీల్స్) త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అడ్వాన్స్ ప్రైసింగ్ ఒప్పందాలు, సేఫ్ హార్బర్స్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని తీసుకురావాలి. 'ప్రత్యక్ష పన్ను కోడ్ సమగ్ర సమీక్షకు చాలా సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత బడ్జెట్‌లో కొన్ని ప్రారంభ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అల్పాదాయ వర్గాలకు వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గించడం ద్వారా వారికి ఉపశమనం కలిగించి, గిరాకీని ఉత్తేజపర్చాల'ని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర సమీర్ గుప్తా అభిప్రాయపడ్డారు. స్థిరమైన వృద్ధి సాధించేందుకు ద్రవ్య లోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.5 శాతానికి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఈవై ఇండియా తెలిపింది. జీడీపీలో రుణాల నిష్పత్తి 54.4 శాతంగా ఉందని, దీన్ని తగ్గిం చాలని పేర్కొంది. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) లక్ష్యమైన 40 శాతానికి తీసుకురావాలని వెల్లడించింది. మధ్య కాలానికి వాస్తవిక జీడీపీ వృద్ధి లక్ష్యం 6.5% కంటే ఎక్కువగా నమోదు కావడానికి ప్రభుత్వం మూలధన వ్యయాలు పెంచాలని ఈవై ఇండియా సూచించింది. ప్రైవేటు రంగ పెట్టుబ డులను ప్రోత్సహించేందుకు వడ్డీ రేట్లను తగ్గించాలని అభిప్రాయపడింది. లక్షిత ఉపాధి పథకాలతో పట్టణ గిరాకీ పెంచి, 2025-26లో ఆర్థిక వృద్ధికి సహకరించాలని కోరింది.

## మార్చి 23న ఐపీఎల్ ప్రారంభం

**- రాజీవ్ శుక్లా**

ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. మే 25న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. బీసీసీఐ ప్రత్యేక సాధారణ సమావేశం ముంబయిలో జరిగింది. ఈ క్రమంలో రాజీవ్ శుక్లా ఐపీఎల్ ప్రారంభం స్పందించారు. అయితే, పూర్తి స్థాయి షెడ్యూల్‌ను మరికొద్ది రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉంది. బీసీసీఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ఐసీసీ ఛైర్మన్‌గా జైషా వెళ్లిన సంగతి తెలిసిందే. జైషా స్థానంలో కొత్త కార్యదర్శిగా దేవజిత్ సైకియా, ట్రెజరర్‌గా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఎంపికైనట్లు బీసీసీఐ ఎస్‌జీఎం వెల్లడించింది.






## నన్ను చూస్తూనే ఉండటం నా భార్యకు ఇష్టం

**- పూనావాలా**

ఉద్యోగులు వారానికి 90 గంటలపాటు పని చేయాలని ఎల్అండ్‌టీ ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. తాజాగా దీనిపై సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా మాట్లాడారు. ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యలతో ఏకీభవించిన ఆయన.. ఎక్కువ గంటల విధానంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నిజమే (ఆనంద్ మహీంద్రా), నా భార్య కూడా నేను మంచివాడినని అనుకుంటుంది. ఆదివారాలు నన్ను చూస్తూ ఉండటమే తనకు ఇష్టం. క్వాంటిటీ కంటే క్వాలిటీనే ముఖ్యం. వర్క్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలి" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతకుముందు ఆనంద్ మహీంద్రా ఇదే అంశంపై వ్యాఖ్యానిస్తూ.. 48, 70 లేదా 90.. ఇలా ఎన్ని గంటలు పని చేశామన్నది ముఖ్యం కాదని ఉత్పాదకతే ప్రధానమన్నారు. "నా భార్య ఎంతో మంచిది. ఆమెను చూస్తూ ఉండటం నాకెంతో ఇష్టం" అంటూ ఆనంద్ మహీంద్రా పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉంటే, 'ఇంట్లో కూర్చొని ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు? ఇంట్లో తక్కువ, ఆఫీసులో ఎక్కువగా ఉంటామని భార్యలకు చెప్పాలి. అవసరమైతే ఆదివారాలు కూడా పని చేయాలి' అంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కార్మిక సంఘాలతో పాటు వ్యాపారవేత్తల నుంచీ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, ఆ వ్యాఖ్యలు విస్తృత ఆశయాన్ని ప్రతిబింబిస్తాయని, అసాధారణ ఫలితాలకు అసాధారణ కృషి అవసరమంటూ తమ ఛైర్మన్ వ్యాఖ్యలను ఎల్ అండ్ టీ సమర్థించే ప్రయత్నం చేసింది.



## కొద్ది నెలలు నేనే సారథిగా ఉంటా..
### బీసీసీఐతో రోహిత్!

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌ను భారత్ కోల్పోవడంపై బీసీసీఐ సమీక్ష చేసింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ మీటింగ్‌కు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ స్పష్టంగా చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. విరాట్, రోహిత్.. ఎవరైనా సరే ఆడితేనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని నిబంధనను కఠినతరం చేయనుంది. మినహాయింపు కావాలంటే కోచ్, చీఫ్ సెలక్టర్ నిర్ణయిస్తారు. అదే సమయంలో భవిష్యత్తు టెస్టు, వన్డే సారథి ఎంపికపైనా తీవ్రంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకుంటాడని అనుకున్నా.. అలాంటిదేమీ లేదని ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. సారథిగా తానే కొన్ని నెలలు కొనసాగుతానని రోహిత్ ఈ మీటింగ్‌లో చెప్పినట్లు కథనాలు వస్తున్నాయి. రోహిత్‌కు బదులు జస్‌ప్రీత్ బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించాలనే సూచనలూ, డిమాండ్లూ వచ్చిన సంగతి తెలిసిందే. మరికొందరు మాజీలు మాత్రం బుమ్రాపై అనవసర ఒత్తిడి పెట్టొద్దని వ్యాఖ్యానించారు. ఈ అంశంపైనా సమీక్ష సమావేశంలో చర్చ జరిగినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. అయితే, బుమ్రా ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ఆందోళనగా ఉన్నట్లు తెలుస్తోంది. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో 150కిపైగా ఓవర్లను వేసిన బుమ్రా వెన్ను నొప్పి కారణంగా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేదు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడటంపై అనుమానాలు మొదలయ్యాయి. దీంతో టెస్టు, వన్డే సారథ్య బాధ్యతలను అప్పగించడంపై బీసీసీఐ ఆలోచన చేస్తున్నట్లుంది. రోహిత్‌నే కొనసాగించి.. బుమ్రా మళ్లీ ఫిట్‌నెస్ సాధించిన తర్వాత కెప్టెన్‌గా చేసేందుకు మొగ్గు చూపే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలోనూ భారత జట్టును రోహిత్ శర్మ నడిపించడం ఖాయంగా కనిపిస్తోంది.

## ముంబయి వీధుల్లో విరాట్-అనుష్క దంపతులు



టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మతో కలిసి ముంబయి వీధుల్లో విహరిస్తున్నారు. తన భార్యతో పాటు నగర వీధుల్లో విహరిస్తూ కెమెరా కంటికి చిక్కాడు. ఆకస్మికంగా కోహ్లీని చూడటంతో అక్కడున్నవాళ్లంతా ఆశ్చర్యపోయారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారుతోంది. ఆస్ట్రేలియాతో ముగిసిన బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో కోహ్లీ నిరాశపరిచాడు. ప్రారంభ మ్యాచ్‌లో సెంచరీ చేసినప్పటికీ, కోహ్లీ తొమ్మిది ఇన్నింగ్స్‌లలో 190 పరుగులు మాత్రమే చేశాడు. త్వరలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. ఇప్పటికే విరాట్ టీ20లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అయితే, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ జట్టులో అతడికి స్థానం ఇస్తారా? లేదా? అనేది వేచి చూడాలి. ఈ సిరీస్‌ల అనంతరం ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడనుంది. తాజాగా విరాట్ కోహ్లీ తాను అమితంగా ఇష్టపడే వృందావన్‌ను మరోసారి సందర్శించాడు. భార్య అనుష్క శర్మ, కుమార్తె వామిక, కుమారుడు అకాయ్‌తో కలిసి ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమానికి వెళ్లారు.

## ఎంసీఏ ప్రోత్సాహం ఎప్పటికీ మరిచిపోలేను : వినోద్ కాంబ్లి



భారత క్రికెట్‌లో ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు ఘన చరిత్ర ఉంది. వాంఖడే స్టేడియం 50 ఏళ్ల పండగకు సిద్ధమైంది. జనవరి 19 నాటికి స్వర్ణోత్సవం నిర్వహించుకోనుంది. వారం రోజుల ముందే ఉత్సవాలను ఎంసీఏ ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. మొన్నటి వరకు ఆసుపత్రిలో చికిత్స పొందిన మాజీ క్రికెటర్లు వినోద్ కాంబ్లి, వసీమ్ జాఫర్, యువ ప్లేయర్ పృథ్వీ షా తదితరులు వచ్చారు. వీరందరినీ ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ సన్మానించి ప్రత్యేక మెమొంటోలను అందించారు. ఈ సందర్భంగా కాంబ్లి మాట్లాడుతూ.. 'ఓపెనింగ్ బ్యాటర్‌గా నేను ఈ కార్యక్రమాన్ని మిస్ కాకూడదని అనుకున్నా. అందుకే, ఇక్కడికి వచ్చా. స్కూల్ క్రికెట్ నుంచి వచ్చిన నాకు ఎంసీఏ చాలా అవకాశాలు ఇచ్చింది. వెనుకండి ప్రోత్సహించింది. భారత జట్టుకు ఆడేటప్పుడూ మద్దతుగా నిలిచింది. ఇంగ్లండ్‌పై తొలి డబుల్ సెంచరీని వాంఖడే మైదానంలోనే సాధించా. భారత జట్టుకు ఎంపిక కావాలంటే ప్రతి ఒక్కరూ నిరంతరం శ్రమించాలని చెబుతా. మా చిన్నప్పుడు చాలా కష్టం. ఈ సందర్భంగా ఎంసీఏకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెబుతున్నా' అని వ్యాఖ్యానించాడు. 'భారత క్రికెట్‌కు ఈ సంఘం అందించిన సేవలు అమోఘం. ఇంతటి పెద్ద వేదికపై నన్ను సన్మానించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. 2011లో వన్డే ప్రపంచకప్‌ను వాంఖడేలోనే భారత్ గెలవడం ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఇప్పుడు 50 ఏళ్ల సంబరాలను ఎంసీఏ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది" అని గావస్కర్ తెలిపాడు. దిలీప్ వెంగ్‌సర్కార్, సచిన్, రోహిత్ శర్మ తదితర క్రికెటర్లకూ ఎంసీఏతో అనుబంధం ఉంది.

## అండర్ -19: ట్రిపుల్ సెంచరీ..
### తొలి భారత మహిళా క్రికెటర్‌గా ఇరా జాదవ్



భారత యువ మహిళా బ్యాటర్ ఇరా జాదవ్ సంచలనం సృష్టించింది. వన్డే మ్యాచ్‌లో జట్టంతా 350ం కొడితేనే గొప్ప అని భావిస్తారు. అలాంటిది ఇరా జాదవే ఏకంగా ట్రిపుల్ శతకం బాదడం విశేషం. ఇది అండర్ – 19 స్థాయిలోనే అయినప్పటికీ తొలి మహిళా భారత క్రికెటర్‌గా ఇరా జాదవ్ అవతరించింది. ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల ఇరా మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో 157 బంతుల్లోనే 346 పరుగులు చేసింది. ఇందులో 42 ఫోర్లు, 16 సిక్సర్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన డబ్ల్యూపీఎల్ వేలంలో ఇరా జాదవ్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. వన్డేల్లో రెండు జట్లు కలిసి చేసే స్కోరును ముంబయి ఒక్కటే సాధించింది. ఇరా జాదవ్ ట్రిపుల్ సెంచరీతోపాటు కెప్టెన్ హుర్లే గాలా (116) సెంచరీ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 50 ఓవర్లలో కేవలం మూడు వికెట్లను కోల్పోయి 563 పరుగులు చేసింది. ఎలినా ముల్లా (8)తో కలిసి ఇరా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ముల్లా త్వరగానే ఔటైనా.. హుర్లేతో కలిసి ఇరా రెండో వికెట్‌కు 274 పరుగులు జోడించింది. సెంచరీ తర్వాత హుర్లే ఔటైనప్పటికీ.. దీక్ష పవార్ (39)తో కలిసి ఇరా జాదవ్ మూడో వికెట్‌కు 186 పరుగులు రాబట్టింది. దీక్ష పెవిలియన్‌కు చేరిన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మితాలీ హర్షద్ (26లి)తో కలిసి ఇరా జాదవ్ మరో వికెట్ పడనీయకుండా స్కోరును 563 పరుగులకు చేర్చింది. నాలుగో వికెట్‌కు కేవలం 33 బంతుల్లోనే 64 పరుగుల భాగస్వామ్యం నిర్మించడం గమనార్హం. ముంబయి నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మేఘాలయ కుప్పకూలింది. కనీసం పోరాటం కూడా చేయకుండానే చేతులెత్తేసింది. ముంబయి బౌలర్ల దెబ్బకు 19 పరుగులకే ఆలౌటైంది. దీంతో మేఘాలయపై 544 పరుగుల భారీ తేడాతో ముంబయి విజయం సాధించింది. మేఘాలయ ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేదు. అదనంగా వచ్చిన 10 పరుగులే టాప్ స్కోరర్. ముంబయి బౌలర్లలో జీయా 3, యయాతి 3, రితికా 2, అక్షయ 2 వికెట్లు తీశారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లకు బుమ్రా వస్తాడా?

ఆస్ట్రేలియా పర్యటనలో జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను నొప్పి తిరగబెట్టిన సంగతి తెలిసిందే. సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ కూడా చేయలేకపోయాడు. స్కానింగ్ తీసినప్పటికీ.. అతడి పరిస్థితి ఏంటో తెలియడం లేదు. మరోవైపు బీసీసీఐ కూడా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడతాడా? లేదా? అనేది అనుమానంగా మారింది. అయితే, అతడిని ఐసీసీ టోర్నీకి ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ సాధిస్తేనే మ్యాచ్ బరిలోకి దిగుతాడని ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే, తాజాగా మరో కథనం చక్కర్లు కొడుతోంది. బుమ్రా గాయంపై ఎన్‌సీఏ నుంచి పూర్తిస్థాయి నివేదిక కావాలని బీసీసీఐ అడిగినట్లు తెలుస్తోంది. ప్రాథమికంగా ఎలాంటి ఫ్రాక్చర్ లేదని.. వాపు మాత్రం ఉన్నట్లు సమాచారం. శనివారం బీసీసీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్‌సీఏకి రిపోర్ట్ చేయాలని బుమ్రాను అడిగినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జనవరి 12 లోగానే స్క్వాడ్‌ను ప్రకటించాల్సి ఉంటుంది. కానీ, భారత్ మాత్రం ఇంకాస్త సమయం తీసుకోనుందని తెలుస్తోంది. జనవరి 19లోగా జట్టును ప్రకటించి.. ఫిబ్రవరి 12లోగా తుది మార్పులు చేసుకొనే అవకాశం ఉంది. బుమ్రా ఫిట్‌నెస్ దృష్ట్యా అతడు మార్చి తొలి వారం నాటికి జట్టుతో చేరగలడని ఎన్‌సీఏ వర్గాలు పేర్కొన్నాయి. అప్పటికి భారత్ లీగ్ స్టేజ్ మ్యాచ్‌లన ఆడేస్తుంది. "బుమ్రా ఎన్‌సీఏకి వెళ్లనున్నాడు. ప్రాథమికంగా వచ్చిన రిపోర్ట్ ప్రకారం ఎలాంటి ఫ్రాక్చర్ లేదు. అయితే, వాపు ఉన్నట్లు తెలుస్తోంది. అతడి పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎన్‌సీఏ గమనిస్తూనే ఉంటుంది. అక్కడే ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడతాడు. ఫిట్‌నెస్‌పై ఓ అవగాహనకు వచ్చాక.. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడతాడు" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

